సాక్షి
శ్రీకాకుళం

గురువారం । 19 । డిసెంబర్ । 2024



రక్తమోడుతున్న రహదారులు

రహదారులు రక్తమోడుతున్నాయి. ప్రమాదాలు పెచ్చుమీరుతున్నాయి.

- 8లో



అనుమానంతోనే..

వివాహిత హత్య కేసును పోలీసులు ఛేదించారు. అనుమానంతో అంతమొందించినట్లు నిర్ధారించారు.

- 8లో

20న జాబ్‌మేళా

శ్రీకాకుళం పాతబస్టాండ్: డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో డెక్కన్ ఫైన్ కెమికల్ ప్రైవేట్ లిమిటెడ్, అపిటోరియల్ ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్‌లో ఉద్యోగాల కోసం ఈ నెల 20న ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు డీఆర్‌డీఏ పీడీ కిరణ్ కుమార్ తెలిపారు. ట్రైనీ కెమిస్ట్రీ, ప్రొడక్షన్ అసిస్టెంట్ పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బీఎస్సీ కెమిస్ట్రీ, పది, ఇంటర్‌మీడియెట్ అభ్యర్థులు అర్హులని తెలిపారు. శ్రీకాకుళంలోని బలగ వద్ద గల ప్రభుత్వ ఐటీఐ వద్దకు హాజరు కావాలన్నారు.

మోసాల రమణ
నిండా ముంచాడు

ఇండియన్ ఆర్మీ కాలింగ్ సెంటర్ ముసుగులో వెలుగు చూస్తున్న మోసాలు



- ప్రజాప్రతినిధులు, అధికారుల పరిచయాలతో చెలరేగిపోయిన నిర్వాహకుడు బసవ వెంకటరమణ
- అమ్మాయిలతో అసభ్యకర వ్యవహారాలు
- ఉద్యోగాలు ఇప్పిస్తామని రూ.కోట్లలో వసూళ్లు
- వెల్లువెత్తుతున్న ఫిర్యాదులు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

ఇండియన్ ఆర్మీకాలింగ్ సెంటర్ రమణ మోసాలు తిలాపాపం..తలా పిడికెడు అన్నట్లుగా కనిపిస్తున్నాయి. పెద్దలతో ఏ మాత్రం పరిచయం ఏర్పడినా దాన్ని తన వ్యాపారాన్ని పెంచుకునే అస్త్రంగా రమణ వాడుకున్నాడు. కేంద్రమంత్రిని.. 'అన్నా' అని సంబోధిస్తూ, ఆయన అండతోనే ఎదిగానని చెబుతూ, ఆయన ఆశీస్సులుంటే మరింత ఎదుగుతానని ఫొటోలు, వీడియోలతో సహా చూపించిన దృశ్యాలు, రక్షణ రంగంలోని అధికారులతో నిర్వహించిన సమావేశాలు, కలెక్టర్లు, జేసీలతో చేపట్టిన కార్యక్రమాలు, ఎమ్మెల్యే, వారి కుటుంబీకులతో నిర్వహించిన ప్రైవేటు కార్యక్రమాలు, నగరంలో జరిపిన పలు ఈవెంట్లతో రమణను పలుకుబడి గల వ్యక్తిగా నమ్మించాయి. ఇదే విద్యార్థుల కొంప ముంచింది.



కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు సహకారంతోనే ఎదిగానని ఇండియన్ ఆర్మీ కాలింగ్ నిర్వాహకుడు బసవ రమణ ప్రచారం చేసుకున్నాడు. ఆయనతో తీసుకున్న ఫొటోలు, వీడియోలను ఫేస్‌బుక్‌లు, వాట్సాప్‌లోనూ పెట్టి తనకున్న అనుబంధాన్ని, సంబంధాలను అందరికీ తెలియజేశాడు. ఆర్మీ కాలింగ్ సెంటర్‌లో చేరిన విద్యార్థులను రామ్మోహన్‌నాయుడు హాజరయ్యే కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేసేవాడు.



సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ అసిస్టెంట్ కమాండెంట్ కంచరాన అవినాష్ వంటి అధికారులను ఇండియన్ ఆర్మీ కాలింగ్ సెంటర్‌కు తీసుకొచ్చి వారితో విద్యార్థులకు అవగాహన కల్పించాడు. తనకు ఎంతో పలుకుబడి ఉందని చెప్పుకునే ప్రయత్నం చేశాడు. దానికోసం ముందస్తుగా పోస్టర్లు, ఫ్లెక్సీల ద్వారా విస్తృత ప్రచారం చేశాడు.



జిల్లాకు వచ్చే కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, ఐఏఎస్ అధికారులు, సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ తదితరులను మర్యాద పూర్వకంగా కలిసి, వారిని మచ్చిక చేసుకుని, పలు కార్యక్రమాలకు ఆహ్వానించేవాడు. ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ అధికారులతో మోటివేషన్ కార్యక్రమాలను నిర్వహించాడు.

- అధికారికంగా జరిగే ఈవెంట్లకు, ప్రైవేటు కార్యక్రమాలకు తన దగ్గర శిక్షణ పొందుతున్న విద్యార్థులను తన సైన్యంగా తీసుకెళ్లి బల నిరూపణ చేసేవాడు. ఈవెంట్ల పేరుతో పెద్ద ఎత్తున శాఖల వారీగా, ప్రైవేటు సంస్థల నుంచి నిధుల సమీకరణ కూడా చేసేవాడు.

- పలువురు జర్నలిస్టులతో కూడా వెంకటరమణ చేతులు కలిపారు. వారికున్న పత్రికల్లో స్పాన్సర్ కథనాలు వండి వార్చారు. అవసరం వచ్చినప్పడల్లా అండగా నిలిచారు. ఉన్నత స్థాయి వ్యక్తులను కలిసేందుకు ఓ జర్నలిస్టును రిఫరెన్స్‌గా వాడుకునే వాడు. పోలీసు శాఖలో పనిచేసిన కొందరు అధికారులు కూడా ఆయనకు అండగా నిలిచారన్న ఆరోపణలు ఉన్నాయి. గతంలో ఫిర్యాదులొస్తే పట్టించుకోకుండా వెంకటరమణకే వత్తాసు పలికిన ఉదంతాలున్నాయి.



అసలు నిజం ఇదీ..

రాజకీయ ప్రముఖులు, ఆర్మీ అధికారులు, ఉన్నతాధికారులతో పరిచయాలను చూపించి విద్యార్థులను నిలువునా ముంచేశాడు. మాజీ మేజర్ జనరల్ తన సంస్థకు ప్రెసిడెంట్‌గా ఉన్నారని నమ్మబలికి నిరుద్యోగ యువతను ట్రాప్ చేశాడు. ఈ ప్రచారం చూసే విద్యార్థులు ఆకర్షితులై ఉద్యోగాల కోసం రూ.3లక్షల నుంచి రూ.10లక్షల వరకు ముట్టచెప్పేశారు. అంతటితో ఆగకుండా శిక్షణ, వసతి అని చెప్పి రూ.లక్షల్లో గుంజేశాడు. మోసం బట్టబయలు కావడంతో వారంతా లబోదిబోమంటున్నారు. శ్రీకాకుళం కేంద్రంగానే కాదు జులుమూరు కేంద్రంగా కూడా మోసం చేశాడు. రోజూ ఆయన చేతిలో మోసపోయిన వారు బయటకి వస్తూనే ఉన్నారు. ఎంత మొత్తంలో వసూలు చేశాడో లెక్క కట్టడం కూడా కష్టమవుతోంది.

భారత రక్షణ వ్యవస్థ మేజర్‌గా ఇంజనీరింగ్ విభాగంలో విధులు నిర్వర్తిస్తున్న మేజర్ పెంటకోట రవికుమార్‌ను కలిసిన ఫొటోలను చూపించి, తనకు అధికారిక పలుకుబడి ఉందని నమ్మించాడు. ఐఏఎఫ్ గ్రూప్ కెప్టెన్ పి.ఈశ్వరరావు వంటి వారితో మోటివేషన్ క్లాసులు ఇప్పించాడు.



రిటైర్డ్ మేజర్ జనరల్ రాజ్‌పాల్ పునియాను ఇండియన్ ఆర్మీ కాలింగ్ సెంటర్ ప్రెసిడెంట్‌గా నియమిస్తూ, ఆయనను శ్రీకాకుళం తీసుకొచ్చాడు. రక్షణ రంగంలో తనకు పెద్ద పెద్ద వ్యక్తులు తెలుసునని చాటి చెప్పే ప్రయత్నం చేశాడు.



జిల్లా కేంద్రంలో జరిగే కార్యక్రమాలకు ఎమ్మెల్యే సతీమణి జీ.స్వాతిని ఆహ్వానించి హడావిడి చేశాడు.

అకృత్యాలు.. వికృత చేష్టలు..

- శిక్షణ, ఉద్యోగాల పేరుతో మోసం చేయడమే కాకుండా తన ఆర్మీ కాలింగ్ సెంటర్‌లో చేరిన విద్యార్థులను హింసించాడు.
- ఏకంగా కాళ్లతో తన్ని, డేటా కేబుల్ వైర్‌తో కొడుతూ చాలామందికి నరకం చూపించాడు.
- శిక్షణలో చేరిన అమ్మాయిల పట్ల అనుచితంగా ప్రవర్తించేవాడు.
- రకరకాల మెసెజ్‌లు, మాటలతో ట్రాప్ చేసే ప్రయత్నం చేశాడు.
- అంతటితో ఆగకుండా అమ్మాయిలున్న వసతి గృహంలో, వాష్ రూమ్‌ల్లో, పరుపులు ఉన్న రూమ్‌ల్లో సీసీ కెమెరాలు పెట్టాడు.
- ఒకసారి దొరికిపోయాక అది విద్యార్థులు, వారి తల్లిదండ్రుల అనుమతితోనే పెట్టానని నమ్మించే ప్రయత్నం చేశాడు.
- సీసీ కెమెరాల గుట్టు బయటకు రాకుండా ఉండటానికి అమ్మాయిలను కూడా భయపెట్టాడు.
- బయటకు చెబితే వీడియోలు బయటకు వస్తాయని, అసభ్యకర ఫొటోలు వెలుగు చూస్తాయని బెదిరించినట్టు ఆరోపణలు కూడా ఉన్నాయి.
- రమణ కోసం ఒక్క మాటలో చెప్పాలంటే రక్షణ రంగంలో ఉద్యోగాల పేరుతో ఓ నియంతలా.. సైకోలా వ్యవహరించాడనే విషయం బాధితుల మాటల్లో స్పష్టమవుతోంది.



న్యూస్‌రీల్

కోవిడ్ బాధితులకు నగదు అందజేత



కోవిడ్ అనాథ బాలికలకు నగదు అందజేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: కోవిడ్ ప్రభావంతో తల్లిదండ్రులను కోల్పోయి అనాథలైన బాలలకు బుధవారం శ్రీకాకుళంలోని ప్రధాన తపాలా కార్యాలయంలో అధికారుల సమక్షంలో నగదు అందజేశారు. కోవిడ్‌తో అనాథలైన చిన్నారులను ఆదుకునేందుకు 2021లో పీఎంకేర్ ఫర్ చిల్డ్రన్ పథకం కింద జిల్లాలో 9 మంది కోవిడ్ అనాథ బాలలకు ఒక్కొక్కరికి రూ.10లక్షల చొప్పున మంజూరు చేశారు. శ్రీకాకుళంలోని ప్రధాన తపాలా కార్యాలయంలో జిల్లా కలెక్టర్ గార్డియన్‌గా చిన్నారులతో జాయింట్ అకౌంట్లను ఓపెన్ చేయించి ఆ పదేసి లక్షల రూపాయలను డిపాజిట్ చేశారు. చిన్నారులకు 18 ఏళ్లు నిండిన తర్వాత సింగిల్ అకౌంట్‌గా ఆ మార్చి.. ప్రతినెల స్టైఫండ్ కింద రూ.5500 ఖాతాలో జమ చేయడం జరిగింది. ఇప్పటి వరకు ఈ విధంగా జమ అయిన మొత్తం వి.వెంకటేశ్వరరావు రూ.84వేలు, బి.పార్థసారధి రూ.లక్షా 68వేలు విత్‌డ్రా చేసుకున్నారు. ఈ మొత్తాలను బుధవారం ప్రధాన పోస్ట్ సూపరింటెండెంట్ వి.హరిబాబు, జిల్లా బాలల రక్షణ అధికారి కెవీ రమణ, హెడ్‌పోస్ట్ మాస్టర్ పి.రంగరావు, అసిస్టెంట్ పోస్ట్ మాస్టర్ ఎం.భానోజీరావు అందజేశారు. ఈ కార్యక్రమంలో బాలల రక్షణ అధికారి (ఎస్‌బీసీ) ఐ.లక్ష్మినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ క్రీడలకు పొన్నాడ కేజీబీవీ విద్యార్థిని



సీహెచ్ రమ్యను అభినందిస్తున్న అధికారులు

ఎచ్చెర్ల క్యాంపస్: పొన్నాడ కేజీబీవీ ఇంటర్మీడియెట్ మొదటి ఏడాది విద్యార్థిని సీహెచ్ రమ్య జాతీయ స్థాయి క్రీడలకు ఎంపికైంది. బేస్‌బాల్ అండర్-19 పోటీలు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో త్వరలో మహరాష్ట్రలో జరగనున్నాయి. రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రదర్శన ద్వారా ఈ విద్యార్థిని ఎంపికైంది. ప్రత్యేక అధికారి సుర్యకళ, అధ్యాపకులు విద్యార్థిని అభినందించారు.

సెలవులోకి విచారణాధికారి

టెక్కలి: టెక్కలి మండలం రావివలస ఎండల మల్లికార్జునస్వామి దేవస్థానంలో కార్తీక మాసోత్సవాల్లో భక్తులకు ఇబ్బందులు కలిగే విధంగా చోటు చేసుకున్న అక్రమాలపై విచారణ చేపట్టిన జిల్లా అధికారి ప్రస్తుతం సెలవులోకి వెళ్లిపోవడం జిల్లా వ్యాప్తంగా ఆ శాఖలో చర్చనీయాంశమైంది. ఇటీవల అక్కడ ఉత్సవాల నిర్వహణలో ఈఓ గురునాథరావు నిర్లక్ష్య వైఖరితో చోటు చేసుకున్న అక్రమాలపై బీజేపీ, జనసేన నాయకులు జిల్లా అధికారులకు ఫిర్యాదులు చేయడం.. ఆ తర్వాత ఏసీ ప్రసాద్ పట్నాయక్ విచారణ చేపట్టడం తెలిసిన విషయమే. ఈ క్రమంలో ఈఓ గురునాథరావుకు, ఏసీ ప్రసాద్‌పట్నాయక్‌కు తెర వెనుక ఉన్న గురు శిష్యుల బంధంతో విచారణ పక్కదారి పడుతుందని శాఖాపరంగా వెల్లువెత్తిన సందేహాలపై సాక్షిలో కథనాలు వెలువడ్డాయి. ఇదే విషయం దేవదాయ శాఖ ఉన్నతాధికారుల దృష్టికీ వెళ్లింది. అయితే విచారణలో ఈఓను రక్షించేందుకు చేసిన ప్రయత్నాల్లో ఇరువురి బంధం బహిర్గతం కావడంతో వ్యక్తిగత కారణాలు చూపించి ఏసీ సెలవులోకి వెళ్లిపోయారనే చర్చ జరుగుతోంది. విచారణలో లోపాలు కనిపిస్తే విషయాన్ని దేవదాయ శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్తామని ఫిర్యాదుదారులు తెలిపారు.

చిరు జల్లులతో రైల్వే పరీక్ష అభ్యర్థుల అవస్థలు



టెంటు కింద ఉన్న అభ్యర్థులు

నరసన్నపేట: స్థానిక కోర్ టెక్నాలజీలో రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు (ఆర్ఆర్‌బీ) పరిధిలో బుధవారం పలు విభాగాలకు సంబంధించి పరీక్షలు నిర్వహించారు. మూడు షిఫ్టుల్లో పరీక్షలు నిర్వహించగా సుమారు 450 మంది హాజరయ్యారు. అయితే ఒడిశాతో పాటు ఏపీలోని పలు జిల్లాల నుంచి అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు. బుధవారం ఉదయం నుంచి వాతావరణం మారడం, చిరు జల్లులు పడుతుండటంతో దూర ప్రాంతాల నుంచి వచ్చిన అభ్యర్థులు ఇబ్బందులు పడ్డారు. రోడ్డుకు ఆనుకొని ఉన్న కోర్ టెక్నాలజీ భవనం పరిసరాల్లో ఎలాంటి షాపులు, ఇళ్లు లేకపోవడంతో జల్లులకు అవస్థలు పడ్డారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి



ఇచ్ఛాపురం రూరల్: లక్ష్మీపురం ప్రాంతంలో రోడ్డు పక్కన భద్రపరిచిన వరి చేను

జలుమూరు: ప్రస్తుత వర్షాలపై రైతులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వ్యవసాయ అధికారి కె.త్రినాథస్వామి అన్నారు. బుధవారం జోనంకిలో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. సేంద్రియ ఎరువులు, ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించి పలు సూచనలు చేశారు. ఎరువులు, పురుగు మందుల వినియోగంపై పలు యాజమాన్య పద్ధతులు వివరించారు. ప్రధానంగా అధిక దిగుబడులకు సస్యరక్షణ పద్ధతులు అవసరమన్నారు. భూసార పరీక్షలు ప్రకారం వ్యవసాయం సాగు, ఎరువులు వేసుకోవాలన్నారు. ప్రస్తుతం రైతులు వర్షం దృష్ట్యా వరి కోతలు, నూర్పులు ఈ నెల 20 వరకూ వాయిదా వేసుకోవాలన్నారు. రైతులకు అవసరమైన టార్పాలిన్లు మండల కేంద్రంలో సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. వీటిని రూ.650 చెల్లించి తీసుకోవాలని వాపసు ఇచ్చేస్తే రూ.650 తిరిగి చెల్లిస్తారని తెలిపారు. అనంతరం అపరాల సాగుపై రైతులకు మెలకువలు వివరించారు. ఆయనతోపాటు ఏడీ రవీంద్రభారతి, ఏఓ కె.సురేష్ కుమార్ ఉన్నారు.



రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి త్రినాథ స్వామి

అన్నదాత ఆందోళన

ఇచ్ఛాపురం రూరల్: అన్నదాత ఆందోళన చెందుతున్నాడు. చేతికి వచ్చిన పంట చేజారిపోతుందేమోనని భయపడుతున్నారు. అల్పపీడనం రైతుల పాలిట శాపంగా మారక ముందే వ్యవసాయ అధికారుల సూచనలు మేరకు రైతులు అప్రమత్తమయ్యారు.

ఎదురొచ్చిన మృత్యువు



త్రివేణి (ఫైల్)



చక్కటి ప్రభుత్వ ఉద్యోగం. ఇష్టమైన వ్యక్తితో వివాహం. బంగారం లాంటి ఇద్దరు సంతానం. అన్నీ సాఫీగా సాగుతున్న ఆమె జీవితం అర్ధంతరంగా ముగిసిపోయింది. వేరే వాహనం చేసిన తప్పునకు ఆమె జీవితం బలైపోయింది. ఏడాది కిందటి వరకు చిత్తూరులో టీచర్‌గా పనిచేసిన ఆమె ఇంటికి దగ్గరగా ఉండాలని కోరి మరీ జిల్లాకు ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నారు. కానీ అంతలోనే విధి వెక్కిరించి ఆమెను తీసుకెళ్లిపోయింది.

- రోడ్డు ప్రమాదంలో ప్రభుత్వ ఉపాధ్యాయిని మృతి
- పాఠశాలకు వెళ్తుండగా స్కూటీని ఢీకొట్టిన కారు
- కారు అతివేగమే ప్రమాదానికి కారణమంటున్న పోలీసులు

టెక్కలి రూరల్: కోటబొమ్మాళి మండలం పాకివలస గ్రామ సమీప జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో టెక్కలి మండలం సన్యాసిపేట ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయురాలు సంపతిరావు త్రివేణి(30) మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు..

ఆమదాలవలస మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన త్రివేణి చిత్తూరు జిల్లాలో పనిచేస్తుండేవారే. ఏడాది కిందటే మ్యూచువల్ ట్రాన్స్‌ఫర్ పెట్టుకుని టెక్కలి మండలం సన్యాసిపేట గ్రామ ప్రభుత్వ పాఠశాలకు వచ్చారు. ఆమె స్వగ్రామం నుంచి పాఠశాలకు రోజూ రాకపోకలు సాగిస్తున్నారు. తిమ్మాపురం నుంచి కోటబొమ్మాళి వరకు బస్సులో వచ్చి.. అక్కడ ఉంచిన తన స్కూటీపై బడికి వెళ్లేవారు. బుధవారం కూడా కోటబొమ్మాళి నుంచి తన పాఠశాలకు వెళ్లేందుకు గాను టెక్కలి వైపుగా స్కూటీపై బయల్దేరారు. అదే సందర్భంలో పలాస నుంచి శ్రీకాకుళం వైపు వెళ్తున్న ఏపీ 39 జేక్యూ5568 నంబర్ గల కారు జాతీయ రహదారిపై అతివేగంగా దూసుకెళ్తూ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టి అవతలి రోడ్డులో వెళ్తున్న త్రివేణి బండిని ఢీకొని అప్రోచ్ రోడ్డులోకి వెళ్లి బోల్తా కొట్టింది.



ప్రమాదానికి కారణమైన కారు



ఘటన స్థలంలో పడి ఉన్న ఉపాధ్యాయురాలి మృతదేహం

ప్రమాదంలో టీచర్ అక్కడికక్కడే ప్రాణాలు వదిలేశారు. కారులో ఉన్న ఇద్దరు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. వారిని టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న టెక్కలి మండల ఎంఈఓలు తులసీరావు, చిన్నారావు మృతదేహాన్ని పరిశీలించారు. ఉపాధ్యాయురాలి మృతిపై పలు ఉపాధ్యాయ సంఘాలు విచారం వ్యక్తం చేశాయి. త్రివేణి ఏడేళ్ల కిందట ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరికి ఇద్దరు ఆడ పిల్లలు ఉన్నారు. టీచర్ చనిపోయారని తెలిసి సన్యాసిపేట వాసులు ఘటనా స్థలానికి చేరుకుని రోదించారు. కోటబొమ్మాళి ఎస్ఐ బి.సత్యనారాయణ కేసు నమోదు చేశారు.

పిల్లలను అంగన్‌వాడీలో ఉంచి..

ఆమదాలవలస: మున్సిపాలిటీ ఒకటో వార్డు తిమ్మాపురం గ్రామానికి చెందిన ఉపాధ్యాయిని సంపతిరావు త్రివేణి (30) రోడ్డు ప్రమాదంలో చనిపోవడంతో స్థానికులు ఉలిక్కిపడ్డారు. పెద్ద కుమార్తె చైత్ర, చిన్న కుమార్తె ఇషికలను అంగన్‌వాడీ కేంద్రంలో విడిచిపెట్టి ఆమె స్కూల్‌కు బయల్దేరారు. అంతలోనే ఆమె చనిపోయారన్న వార్త తెలియడంతో భర్త సింహాచలంతో పాటు స్థానికులు నిశ్చేష్టులయ్యారు. సాయంత్రానికి అమ్మ వచ్చేస్తుందని ఎదురు చూస్తున్న ఆ చిన్న పిల్లలను చూసి కంట తడి పెట్టారు.



పిల్లలతో త్రివేణి (ఫైల్)


పోయిన లక్షలు తిరిగొచ్చిన వేళ!

ఈ చిత్రంలో సన్మానం అందుకుంటున్న వ్యక్తి శ్రీకాకుళం ప్రధాన తపాలా కార్యాలయ పోస్టుమాస్టర్ రంగారావు. సన్మానం చేస్తున్నది అరసవల్లి ప్రాంతానికి చెందిన సీనియర్ సిటిజన్ ఆర్.టి.వి.ప్రసాదరావు. ఈ కార్యక్రమం ఎందుకు నిర్వహించారంటే కొన్ని రోజులు వెనక్కి వెళ్లాల్సిందే. ప్రసాదరావు తాను దాచుకున్న రూ.15 లక్షలను ఇటీవల బ్యాంకుకు వెళ్లి పోస్టాఫీసు సీనియర్ సిటిజన్ అకౌంట్‌లో పొదుపు చేయాలని సిబ్బందికి చెప్పారు. అయితే సాంకేతిక లోపం కారణంగా ఆ సొమ్ము ఉత్తరప్రదేశ్ రాష్ట్రం లక్నోకు చెందిన వ్యక్తి అకౌంట్‌కు జమ అయ్యింది. ఈ విషయాన్ని పోస్టుమాస్టర్‌కు బాధితుడు తెలియజేయగా అంబుడ్స్‌మెన్ ద్వారా నగదు తిరిగి రప్పించారు. ఆ మొత్తాన్ని బుధవారం శ్రీకాకుళం ప్రధాన తపాలా కార్యాలయంలో అందజేశారు. పోయిన నగదు తిరిగి పొందడంతో ప్రసాదరావు ఆనందం వ్యక్తం చేస్తూ తపాలా అధికారులు, సిబ్బంది సేవలను మెచ్చుకున్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ ఆర్.గౌరీశంకర్, పి.కమలహాసన్, అసిస్టెంట్ పోస్ట్‌మాస్టర్ నూలు భానోజీరావు, సిబ్బంది యూవీ రమణ, ఢిల్లేశ్వరరావు పాల్గొన్నారు.



– శ్రీకాకుళం అర్బన్

అతిపెద్ద చర్చి



క్రిస్మస్ స్పెషల్

ఆర్‌సీఎం చర్చి

శ్రీకాకుళంలోని ప్రభుత్వ కళాశాల రోడ్డులో ఉన్న ఆర్‌సీఎం సహాయ మాత ఆలయం ఉత్తరాంధ్ర జిల్లాల్లోనే అతి పెద్ద ప్రార్థనా మందిరంగా పేరు పొందింది. 2007లో దీన్ని బిషప్ ఇన్నయ్య ప్రారంభించారు. సుమారు వంద అడుగుల పొడవుతో ఎత్తైన నిర్మాణాలు, ఇతర కళారూపాలు ఫైబర్ గ్లాసులో అమర్చిన పాత్ర ప్రత్యేక ఆకర్షణగా కనిపిస్తాయి. సుమారు రెండు వేల మంది ఇక్కడ ప్రార్థన చేసుకోవచ్చు. క్రిస్మస్ సందర్భంగా ఈనెల 15నుంచి 22 వరకు ప్రతి గ్రామానికి, ఇంటికి వెళ్లి క్రిస్మస్ గ్రీటింగ్స్ చెపుతూ కేరల్స్ నిర్వహిస్తున్నట్లు ఫాదర్ భూషణ్ తెలిపారు. 24 రాత్రి 11 గంటల నుంచి 2గంటల వరకు క్రీస్తు పుట్టిన రోజు వేడుకలు జరుగుతాయని, 25 ఉదయం 10 గంటల నుంచి కూడా ప్రార్థనలు జరుగుతాయని వివరించారు.

–శ్రీకాకుళం కల్చరల్

క్లుప్తంగా

20న ఎల్‌ఎల్‌బీ స్పాట్ అడ్మిషన్లు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వ విద్యాలయంలో లాసెట్ - 2024 తుది విడత కౌన్సెలింగ్ తరువాత మిగులు సీట్లకు ఈ నెల 20న స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు రిజిస్ట్రార్ పి.సుజాత బుధవారం తెలిపారు. డిగ్రీలో ఓసీ- 45 శాతం, బీసీ-42 శాతం, ఎస్టీ, ఎస్సీ- 40 శాతం మార్కులు కలిగి ఉండి లాసెట్ -2024 ప్రవేశ పరీక్షలో అర్హత సాధించిన వారు అర్హులని పేర్కొన్నారు. లాసెట్ ర్యాంకు కార్డు, విద్యార్హత ధ్రువీకరణ పత్రాలు, టీసీలతో హాజరు కావాల్సి ఉంటుందని తెలిపారు. ఫీజు స్ట్రక్చర్ రూ.10345, పరీక్షల ఫీజు చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు. స్పాట్ అడ్మిషన్లకు ఎటువంటి ప్రభుత్వ రాయితీలు వర్తించబోవని స్పష్టం చేశారు. మూడేళ్ల ఎల్‌ఎల్‌బీలో 60 సీట్లకు గాను 12 సీట్లు ఖాళీగా ఉన్నాయని, ఇందులో రెండు ఈడబ్ల్యూఎస్ సీట్లు ఉన్నట్లు వివరించారు. విద్యార్థుల ఎక్కువగా హాజరైతే ర్యాంకు మెరిట్, రిజర్వేషన్ రోస్టర్ పరిశీలించి ప్రవేశాలు కల్పిస్తామని తెలిపారు.

విద్యార్థి అదృశ్యం



శ్రీకాకుళం రూరల్: మండలంలో పెదపాడు పరిధి శాస్త్రులపేటలోని ఎంజేపీఏపీ బీసీడబ్ల్యూ స్కూల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థి వాసుపల్లి నేతాజీ ఈనెల 17వ తేదీన ఉదయం అదృశ్యమైనట్లు విద్యార్థి తండ్రి వాసుపల్లి ధనరాజు బుధవారం శ్రీకాకుళం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విద్యార్థి సోంపేట మండలం ఇసుకలపాలేం గ్రామానికి చెందినవాడని తెలిపారు. రూరల్ ఎస్‌ఐ రాము కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. విద్యార్థి ఆచూకీ తెలిసినవారు 63099 90845 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

పొలంలో గుర్తు తెలియని మృతదేహం



మృతదేహం తీసుకొస్తున్న పోలీసులు

మెళియాపుట్టి : మండలంలోని గొప్పిలి గ్రామ శివారులో కొల్లాన సూర్యనారాయణ అనే రైతుపొలంలో గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహం బుధవారం లభ్యమైంది. కొందరు రైతులు అటుగావె వెళ్లడంతో మృతదేహాన్ని గుర్తించి వీఆర్వో సింహాచలంకు సమాచారం అందించారు. ఆయన ద్వారా విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాతపట్నం తరలించారు. వృద్ధుడు రెండు వారాలుగా గొప్పిలి పరిసర ప్రాంతంలోనే తిరుగుతుండేవాడని స్థానికులు చెబుతున్నారు.

రక్తమోడుతున్న రహదారులు



- డివైడర్‌ను దాటి అవతలి వైపునకు దూసుకెళ్తున్న వాహనాలు
- ప్రాణాలు కోల్పోతున్న అమాయకులు
- అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగే కారణం
- మూడు వారాల్లో 18 మంది మృత్యువాత

శ్రీకాకుళం క్రైమ్ :

జిల్లాలో రహదారులు రక్తమోడుతున్నాయి. అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్, తొందరగా గమ్యం చేరాలనే ఆతృత, నిద్రమత్తు.. ఇలా కారణాలు ఏవైతేనే దాదాపు ప్రతిరోజూ నిండు ప్రాణాలు బలై పోతున్నాయి. మూడు వారాల వ్యవధిలో 18 మంది మృత్యువాత పడ్డారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. రహదారులపై రక్తపు మరకలు తడారకముందే మరో ప్రమాదం చోటుచేసుకుని తునాతునకలుగా రక్తపు ముద్దలు ఎగిరిపడుతున్నాయి. వాహనచోదకుల నిర్లక్ష్యంతో పాటు రహదారుల నాణ్యతా ప్రమాణాల్లో లోపం కూడా కొన్నిసార్లు ప్రమాదాలకు కారణమవుతున్నాయన్న వాదనలూ వినిపిస్తున్నాయి.

ప్రాణాలు తీస్తున్న అతివేగం..

- నవంబరు 30న విజయనగరం జిల్లా భోగాపురం వద్ద హైవేపై మితిమీరిన వేగంతో వెళ్తున్న కారు అదుపు తప్పి డివైడర్ ఎక్కించి ఆవలి రోడ్డు వైపునకు వెళ్లి లారీని ఢీకొనడంతో నలుగురు జిల్లావాసులు దుర్మరణం చెందారు.
- కొద్దిరోజులు క్రితం పైడిభీమవరంలో రాత్రి సమయంలో హైవే ఫ్లైఓవర్‌పై రక్షణగోడను మితిమీరిన వేగంతో ద్విచక్రవాహనం ఢీకొనడంతో చోదకుడు పైనుంచి కింద సర్వీసు రోడ్డు ఫుట్‌పాత్‌పై పడి ప్రాణాలు వదిలాడు.



మెళియాపుట్టి మండలం చిన్నహంస వద్ద ప్రమాదం(ఫైల్)

- ఈ నెల 9న రణస్థలం పాత పెట్రోల్ బంక్ నుంచి ద్విచక్రవాహనంపై వస్తున్న పాటయ్యను మరో ద్విచక్రవాహనదారుడు ఢీకొట్టడంతో కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతిచెందాడు.
- ఈ నెల 8న తమిళనాడు నుంచి జార్ఖండ్‌కు వెళ్తుందుకు కొబ్బరికాయల లోడుతో వస్తున్న లారీ ఎచ్చెర్ల ఫరీదుపేట కొయ్యరాళ్ల కూడలి వద్ద విద్యుత్తుస్తంభాన్ని (టవర్‌ను) బలంగా ఢీకొట్టి ఆగి పోయింది. క్యాబిన్‌లో ఉన్న డ్రైవర్ మృతి చెందగా వెనుక నిద్రిస్తున్న క్లీనర్ ప్రాణాలతో బయటపడ్డా డు. ఏమాత్రం స్తంభాన్ని ఢీకొన్న లారీ ఆగకపోయివుంటే సమీపంలో ఉన్న ఇళ్లల్లో చొచ్చుకుపోయేది.
- ఈనెల 5న మెళియాపుట్టి మండలం చినహంస సమీపంలో ధాన్యపు లోడుతో వెళ్తున్న ట్రాక్టర్‌ను ఓవర్‌టేక్ చేయబోయి ఎడ్జ్‌లో ద్విచక్రవాహనం అదుపు తప్పడంతో ఓ యువకుడు, బాలిక మృతిచెందారు. ఇద్దరు చిన్నారులకు గాయాలయ్యాయి. ద్విచక్రవాహనంపై నలుగురు వెళ్లడం గమనార్హం..
- ఈ నెల 4న మెళియాపుట్టి మండలం కొసమాలకు చెందిన శామ్యూలు, మరో వ్యక్తితో కలిసి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా ప్రయివేటు బస్సు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు.
- ఈ నెల 1న లావేరు మండలం బొంతపేట వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొట్టి ఓ వ్యక్తి గాయాలపాలై మరుసటి రోజు మృతిచెందాడు.
- నవంబరు 30న జి.సిగడాం మండలం సంతపురిటి వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో రాజాంకు చెందిన మహిళ మృతిచెందింది.
- నవంబరు 28న ఆమదాలవలస పార్వతీశ్వరునిపేట సమీపంలో ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా పాలకొండ వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. వీరఘట్టం మండలం జె.గోపాలపురం యువకుని తలపైనుంచి బస్సు టైర్ ఎక్కేయడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మరో యువకుడికి గాయాలయ్యాయి.
- నవంబరు 27 అర్ధరాత్రి ఒంటిగంటకు కంచిలి సమీప జాడుపూడి కాలనీ వద్ద ద్విచక్రవాహనం అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో ఓ యువకుడు మరణించాడు.
- కంచిలి మండలంలోని కొన్నాయిపుట్టుగ పంచాయతీ సూదిపుట్టుగ గ్రామం వద్ద డిసెంబర్ 14న రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కవిటి మండలం మాణిక్యపురం గ్రామానికి చెందిన రమేష్ బెహరా(25) అనే యువకుడు దుర్మరణం పాలయ్యాడు.
- రణస్థలం మండలంలోని వల్లభరావుపేటకు చెందిన దన్నాన సూర్యనారాయణ(58) డిసెంబర్ 15న జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు.
- నరసన్నపేట మండలం జోగిపేటకూడలికి చెందిన నారాయణశెట్టి భవాని (35) డిసెంబర్ 15న జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది.
- ఆమదాలవలస మండలంలోని ముద్దాడపేటకు చెందిన లాస ఎర్రయ్య(40) డిసెంబర్ 14న ట్రాక్టర్ ఢీకొనడంతో గాయపడి చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు.
- కోటబొమ్మాళి మండలం పాకివలస వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయురాలు సంపతిరావు త్రివేణి(30) మృతిచెందారు.

కొంపముంచుతున్న నిర్లక్ష్యం..

కాంక్రీట్ దిమ్మలు అడ్డంగా ఉంచేయడం, వర్షాలు పడితే నిల్వ ఉన్న నీటిని తక్షణమే తొలగించకపోవడం, జారిన ఇసుకను వారాల తరబడి తీయకపోవడం, గుంతలు పూడ్చకపోవడం, ఎడ్జుల్లో గ్రావెల్‌ను నింపకపోవడం, పొదలు తొలగించకపోవడం వంటి చిన్న చిన్న నిర్లక్ష్యాలూ ప్రమాదాలకు కారణమవుతున్నాయి. హెల్మెట్లు ధరించని ద్విచక్ర వాహనచోదకులను అంతగా పట్టించుకోకపోవడం, ట్రిపుల్ రైడింగ్‌కు మించి నడపడం, ఓవర్‌స్పీడ్ తెలిపే నియంత్రికలు లేకపోవడం.. ఒకవేళ ఉన్నా అవి వాహనదారునికి తెలియకుండా చలానాలు ఆన్‌లైన్‌లో వేసేయడం వంటివి చేస్తుండటంతో చాలామంది సీరియస్‌గా తీసుకోవడం లేదు. మరోవైపు కార్లలో సీట్‌బెల్టు ధరించకపోయినా పట్టించుకుంటున్న దాఖలాలు లేవు. ఇక ట్రాక్టర్లు, ఆటోలు, లారీలు, ఓవర్‌లోడింగ్ వాహనాల సంగతి సరేసరి.





ఎచ్చెర్ల కొయ్యిరాళ్ల కూడలి వద్ద టవర్‌ను ఢీకొన్న లారీ(ఫైల్)

అనుమానంతోనే అంతమొందించాడు

- వివాహిత హత్యకేసులో నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు

ఆమదాలవలస: తనతో సహజీవనం సాగిస్తున్న మహిళ వేరొకరితో చనువుగా ఉంటూ.. ఇద్దరితోనూ వివాహేతర సంబంధం పెట్టుకుందన్న అనుమానంతోనే ఆమదాలవలస మండలం ఆర్ అర్ కాలనీకి చెందిన దామోదర పద్మ(35)ను అదే గ్రామానికి చెందిన సాండి సురేష్ హత్య చేసినట్లు శ్రీకాకుళం డీఎస్పీ సీహెచ్ వివేకానంద తెలిపారు. ఈ నెల 15వ తేదీ రాత్రి జరిగిన హత్య కేసుకు సంబంధించిన వివరాలను ఆమదాలవలస పోలీస్‌స్టేషన్‌లో బుధవారం విలేకరులకు వెల్లడించారు. పద్మ భర్త రెండేళ్ల కిందటే అనారోగ్యంతో మృతిచెందాడు. దీంతో ఆమె ఆర్‌ఆర్ కాలనీలోనే కిరాణా దుకాణం పెట్టుకొని ఇద్దరు కుమార్తెలతో జీవనం సాగిస్తోంది. పక్కింట్లో ఉన్న సాండి సురేష్.. పద్మతో చనువుగా ఉంటూ తరచూ ఫోన్‌లో మాట్లాడేవాడు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య వివాహేతర సంబంధం ఏర్పడింది. మూడు నెలలుగా సురేష్‌ను పద్మ పట్టించుకోకపోవడం, సరిగ్గా మాట్లాడకపోవడంతో అనుమానం పెంచుకున్నాడు. ఈ క్రమంలో వేరొక వ్యక్తితో చనువుగా ఉంటోందని భావించిన సురేష్ పద్మను చంపాలని నిర్ణయించుకున్నాడు. ఈ నెల 15న పద్మ ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యుల సమక్షంలో కత్తితో చాతీపై పొడిచి పరారయ్యాడు. దీంతో పద్మ అక్కడికక్కడే మృతిచెందింది. వెంటనే బాధితురాలి బంధువులు పోలీసులకు సమాచారం ఇవ్వగా.. అప్పటికే గ్రామం పక్కనే ఉన్న సంగమేశ్వర కొండపైకి పారిపోయాడు. తర్వాత రోజు ఆమదాలవలస పోలీసులు డ్రోన్ కెమెరా సాయంతో వెతకగా కొండపై ఉన్నట్లు గుర్తించారు. అయితే పోలీసులు వెళ్లేసరికే పారిపోయేవాడు. ఎట్టకేలకు ఈ నెల 17న ఆర్‌ఆర్‌కాలనీ వీఆర్‌ఓ వద్ద సురేష్ లొంగిపోయాడు. దీంతో నిందితుడిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించారు. సమావేశంలో సీఐ సత్యనారాయణ, ఎస్‌ఐ కె.వెంకటేష్, పోలీసులు సిబ్బంది పాల్గొన్నారు.



కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వివేకానంద. వెనుక నిందితుడితో పోలీసులు

మృతురాలి నంబర్‌తో అశ్లీల వీడియోలు..

పద్మ బతికుండగానే ఆమె ఫోన్‌లో వాట్సాప్ క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి హ్యాక్ చేసిన సురేష్.. ఆమెకు వచ్చిన మెసేజీలు గమనించేవాడు. హత్య చేశాక కూడా పద్మను చెడుగా ప్రచారం చేయాలనే ఉద్దేశంతో మృతురాలి బంధువులు, స్నేహితులతో వాట్సాప్ గ్రూప్ క్రియేట్ చేసి ఆమెతో కలిసి ఉన్న ఫొటోలు, అశ్లీల వీడియోలు ఆమె నెంబర్‌తోనే గ్రూప్‌లలో పోస్ట్ చేసేవాడు. సురేష్ గతంలో పోలాకి మండలం ప్రియాగ్రహారానికి చెందిన మహిళా వలంటీర్‌ను సైతం వేధించాడు. తాను చెప్పినట్లు వినకపోతే ఫొటోలు, వీడియోలను సోషల్‌మీడియాలో పెడతానని బెదిరించడంతో బాధితురాలు పోలాకి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

గ్యాస్ సిలిండర్ల దొంగలు అరెస్టు

పొందూరు: మండలంలో గ్యాస్ సిలిండర్లు, సెల్‌ఫోన్ల దొంగతనానికి పాల్పడుతున్న ముగ్గురు యువకులను పోలీసులు అరెస్టు చేశారు. ఇటీవల గ్యాస్ సిలిండర్లు మాయమవుతున్నాయని, సెల్‌ఫోన్లు చోరీ అవుతున్నాయని పలువురు ఫిర్యాదు చేశారు. దీనిపై ఎస్‌ఐ వి.సత్యనారాయణ ఆధ్వర్యంలో పోలీసులు రంగంలోకి దిగి టెక్కలి మండలం గోపీనాథపురం గ్రామానికి చెందిన కొమ్ము కార్తీక్, గాలి వెంకటేష్, నగిరి నాగరాజులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 4 సెల్‌ఫోన్లు, 30 గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. వీరిలో కొమ్ము కార్తీక్, గాలి వెంకటేష్ గుంటూరు జిల్లా వినుకొండకు చెందిన వారని ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసి నిందితులను అరెస్టు చేసినట్లు ఎస్సై చెప్పారు.



పట్టుబడిన నిందితులతో ఎస్‌ఐ

ఆర్టీసీలో డ్రైవర్లుగా పనిచేసేందుకు దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాకుళం అర్బన్: శ్రీకాకుళం ఏపీఎస్‌ఆర్టీసీ 1వ, 2వ డిపోలలో ఆన్‌కాల్ డ్రైవర్లుగా పనిచేసేందుకు ఆసక్తి, అర్హత కలిగి ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని డిపో మేనేజర్లు అమరసింహుడు, కె.ఆర్.ఎస్.శర్మ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఈ నెల 24వ తేదీలోగా శ్రీకాకుళం 1వ, 2వ డిపోల కార్యాలయాలలో సంప్రదించాలని పేర్కొన్నారు. హెవీ డ్రైవింగ్ లైసెన్స్ వచ్చి 18 నెలలు పూర్తయిన వారు అర్హులని తెలిపారు. పాస్‌ఫోటో, బ్లడ్ గ్రూప్ సర్టిఫికెట్, జెన్యూన్ సర్టిఫికెట్‌తో హాజరుకావాలని కోరారు. పూర్తి వివరాలకు 9959225608, 9959225609 నంబర్లను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

స్థల వివాదంపై ఆరా

సంతబొమ్మాళి: మండలంలోని నౌపడ వైఎస్సార్ కాలనీలో ఇళ్ల స్థలాలను తహసీల్దార్ ఆర్.రమేష్‌కుమార్ పరిశీలించారు. నౌపడ టీడీపీలో ఆధిపత్య పోరు అనే శీర్షికన సాక్షిలో బుధవారం కథనం ప్రచురితం కావడంతో రెవెన్యూ, పోలీస్, పంచాయతీ అధికారులు స్పందించారు. తహసీల్దార్ రమేష్‌కుమార్ ఘటనా స్థలానికి చేరుకుని నలుగురు లబ్ధిదారులతో పాటు అనపాన నగేష్‌తో మాట్లాడారు. స్థల పత్రాలను గురువారం తన కార్యాలయానికి తీసుకుని రావాలని సూచించారు. అంతకుముందు లబ్ధిదారులు తమకు కేటాయించిన స్థలంలోకి మురుగునీరు రావడంతో ఇబ్బందులు పడుతున్నామని తహసీల్దార్ దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ పి.రవికుమార్‌రెడ్డి, నౌపడ ఎస్సై నారాయణస్వామి, వీఆర్వో మంగులు, పంచాయతీ కార్యదర్శి ఉమాపతి పాల్గొన్నారు.



స్థలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్, ఎస్సై

ఉత్సాహంగా పోలీస్ స్పోర్ట్స్ మీట్



ఎచ్చెర్ల ఆర్మ్‌డ్ రిజర్వ్ మైదానంలో పోలీస్ స్పోర్ట్స్ మీట్-24 ఉత్సాహంగా జరుగుతోంది. స్పోర్ట్స్ మీట్ బుధవారంతో ముగియనుంది. హైజంప్, లాంగ్ జంప్, అథ్లెట్, క్రికెట్, కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఆర్మ్‌డ్ రిజర్వ్ డీఎస్పీ శేషాద్రి పర్యవేక్షిస్తున్నారు. శ్రీకాకుళం, టెక్కలి, కాశీబుగ్గ సబ్ డివిజన్, ఆర్మ్‌డ్ రిజర్వ్, హోంగార్డులు ఐదు జట్లుగా తలపడుతున్నారు. -ఎచ్చెర్ల క్యాంపస్

మిల్లర్ల ఐక్యతకు కృషి

శ్రీకాకుళం పాతబస్టాండ్: రైతులకు మేలు జరిగేలా మిల్లర్లు కృషి చేయాలని, మిల్లర్లంతా ఐక్యతగా ముందుకుసాగుదామని జిల్లా రైస్‌మిల్లర్ల సంఘం నూతన అధ్యక్షుడు బోయిన రమేష్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని మిల్లర్ల సంఘం భవనంలో నిర్వహించిన సమావేశంలో సంఘ నూతన అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నికవ్వడం మిల్లర్ల ఐక్యతకు నిదర్శనమన్నారు. 2016-19 మధ్య అధ్యక్షుడిగా పనిచేసినా ఆశించిన మేర మిల్లర్లకు న్యాయం చేయలేకపోయానని, ఈసారి మేరకు నాయకులు, జిల్లా మంత్రి, ఇతర పెద్దల సాయంతో కృషి చేస్తానని చెప్పారు. పూర్వ అధ్యక్షుడు వాసు హయాంలో జిల్లాలో మిల్లర్లకు సంపూర్ణ న్యాయం జరిగిందని, సంఘానికి అన్ని రకాలుగా న్యాయం చేశారని తెలిపారు. రైస్ మాఫియా ఆగడాలు వెలుగుచూడటంతో కూటమి ప్రభుత్వం మిల్లర్లను భూతద్దంలో చూస్తోందని, మిల్లర్లు స్వార్థం వీడి ప్రభుత్వానికి, రైతులకు మేలు జరిగేలా వ్యవహరించాలని కోరారు. కార్యక్రమంలో పూర్వ అధ్యక్షుడు వాసు, కేవీ గోపాలకృష్ణ, శాశ్వత అధ్యక్షుడు కింజరాపు హరివరప్రసాద్, గొండు కష్ణమూర్తి, చిన్నాల కూర్మినాయుడు, సుసరాం భూషణ్, తంగుడు జోగారావు, తంగుడు నాగేశ్వరరావు, జామి నర్సింహమూర్తి, లాడి రమేష్, తాలాసు కష్ణరావు, శాసనపూరి మురళీకష్ణ తదితరులు ఉన్నారు.

నేటి నుంచి బైపీసీ స్ట్రీమ్ కౌన్సెలింగ్

ఎచ్చెర్ల క్యాంపస్: ఏపీ ఈఏపీ సెట్-2024 ప్రవేశాలకు సంబంధించి గురువారం నుంచి బైపీసీ స్ట్రీమ్ ప్రవేశాల చివరి విడత కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ బి.జానకిరామయ్య, సహాయ కేంద్రం కోఆర్డినేటర్ డి.మురళీకృష్ణ బుధవార తెలిపారు. బైపీసీ స్ట్రీమ్ బీటెక్, బీఈ బయోటెక్నాలజీ, ఫుడ్ టెక్నాలజీ, డీ ఫార్మాలో ప్రవేశాలు లభిస్తాయని అన్నారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, ఫీజు చెల్లింపు గురు, శుక్రవారం, ఈ నెల 21లోపు సర్టిఫికెట్ వెరిఫికేషన్, 22లోపు వెబ్ ఆప్షన్లు, 22న ఆప్షన్లు మార్పు, సీట్లు అలాట్‌మెంట్లు 24న, 26లోపు సెల్ఫ్ రిపోర్టు చేయాల్సి ఉంటుంది.

పాలిటెక్నిక్ స్పోర్ట్స్‌మీట్ ప్రారంభం



మార్చ్‌ఫాస్ట్ నిర్వహిస్తున్న క్రీడాకారులు

ఎచ్చెర్ల క్యాంపస్: ఏపీ సాంకేతిక విద్యాశాఖ నిర్వహిస్తున్న అంతర పాలిటెక్నిక్ కళాశాలల స్పోర్ట్స్ మీట్ - 2024 శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో బుధవారం ప్రారంభమైంది. ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు హాజరై క్రీడా, కళాశాల పతకాలను ఎగుర వేశారు. బెలూన్లు గాలిలో విడిచిపెట్టి క్రీడా జ్యోతిని వెలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యమివ్వాలని పిలుపునిచ్చారు. ప్రిన్సిపాల్ డాక్టర్ బి.జానకి రామయ్య మాట్లాడుతూ క్రీడల్లో ఉత్తమ ప్రతిభ చూపే విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికవుతారని చెప్పారు. మూడు రోజుల పాటు పోటీలు జరుగుతాయన్నారు. అనంతరం జరిగిన చెస్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో పోటీలు హోరాహోరీగా సాగాయి. స్థానిక కళాశాలతో పాటు శ్రీకాకుళం ప్రభుత్వ మహిళల కళాశాల క్రీడా మైదానంలోనూ ఈ క్రీడాపోటీలు జరుగుతున్నాయి. కాగా, ఈ పోటీలకు ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలోని పది పాలిటెక్నిక్ కాలేజీల క్రీడాకారులు హాజరయ్యారు. కార్యక్రమంలో మహిళా కళాశాల ప్రిన్సిపాల్ విక్టర్ పాల్, విభాగాధిపతులు గురుగుబెల్లి దామోదర్‌రావు, డి.మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



క్రీడాజ్యోతి వెలిగిస్తున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు